క్లుప్తంగా

వరిలో నీటి యాజమాన్యం ముఖ్యం



నకరికల్లు: రబీలో వరి నాట్లు వేసేందుకు చదరపు మీటరుకు 44 కుదుళ్లు ఉండేవిధంగా చూసుకోవాలని పల్నాడు జిల్లా బీఆర్సీ డీడీఏ శివకుమారి తెలిపారు. మండలంలోని నర్సింగపాడు గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వేస్తున్న వరి నాట్లను పరిశీలించారు. నీటి యాజమాన్యం గురించి వివరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు, వ్యవసాయ అధికారి కె.దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

24 వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు

నాదెండ్ల: మండలంలోని అన్ని సచివాలయాల్లో ఆధార్ కార్డుల అప్‌డేట్ స్పెషల్ క్యాంప్‌లను గురువారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ తెలిపారు. తొలిరోజు నాదెండ్ల 1,2 సచివాలయాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ నిర్వహించారు. 20వ తేదీ ఉదయం 9.30–12.30 గంటల వరకూ చిరుమామిళ్ల, మధ్యాహ్నం 2–5.30 గంటల వరకూ సంకురాత్రిపాడు, జంగాపల్లె, 21వ తేదీ ఉదయం బుక్కాపురం, చందవరం, మధ్యాహ్నం గొరిజవోలు, 23న ఉదయం సాతులూరు, కనపర్రు, మధ్యాహ్నం తూబాడు, కనపర్రు, 24న ఉదయం ఇర్లపాడు, అప్పాపురం, అమీన్‌సాహెబ్‌పాలెం, మధ్యాహ్నం గణపవరం గ్రామాల్లోని సచివాలయాల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌ను నాదెండ్ల 1 సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ అజయ్‌దీపక్ పర్యవేక్షించనున్నారు.

ఘనంగా రాణా ప్రతాప్‌సింగ్ వర్ధంతి



నరసరావుపేట ఈస్ట్: మేవార్ మహారాజు రాణా ప్రతాప్‌సింగ్ 427వ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణ బొందిలి సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నవారికి పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ కె.ఎస్.దయానిధి, సివిల్ సర్జన్ డాక్టర్ మంత్రూనాయక్, బి.సి వెల్ఫేర్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు దేవళ్ల వెంకటేశ్వరరావు, ఏపీ బొందిలి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొందిలి శ్రీనివాససింగ్, పట్టణ గౌరవాధ్యక్షుడు క్షత్రి శివసింగ్, కార్యదర్శి బొందిలి కృష్ణసింగ్ పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమయ్యేలా ఉపాధ్యాయులు ఐక్యంగా తమవంతు కృషి చేయాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతి ఏటా పాఠశాల అభివృద్ధి ప్రణాళిక నిధులు విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.15 వేల నుంచి 75 వేల వరకు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. నాడు–నేడు ఎంపికైన పాఠశాలల్లో జరిగిన పనులు, జరగాల్సిన పనుల పురోగతిపై ఎంపీపీ ఆరా తీశారు. కార్పొరేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మెను ప్రకారం మంచి పోషకాలు కలిగిన వంటకాలు విద్యార్థులు అందిస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి దక్కుతుందన్నారు. సదస్సులో ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్యలు ఉన్నారు.

లక్ష్మీతిరుపతమ్మ తల్లి జ్యోతి ఊరేగింపు



దాచేపల్లి: నగర పంచాయతీ పురవీధుల్లో లక్ష్మీ తిరుపతమ్మ తల్లి జ్యోతి ఊరేగింపు కార్యక్రమం గురువారం చేపట్టారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై లక్ష్మీతిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి ఉత్సవ విగ్రహాలు అలంకరించారు. అనంతరం అమ్మవారి జ్యోతి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. నగర పంచాయతీ పురవీధుల్లో జ్యోతిని ఊరేగిస్తుండగా భక్తులు ప్రత్యేకంగా పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గురుస్వాములు కోత్రపాటి ఏర్రయ్య, మస్తాన్, రామారావు, అన్నం సైదారావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- వివక్ష లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లి 3వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



మహిళకు సంక్షేమ పథకాలు వివరించి, బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా రంజక పాలన అందిస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని రెండవ సచివాలయం పరిధిలో గల మూడో వార్డు (సుగాలి కాలనీ)లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కుల, మత, పార్టీ, రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికగా ప్రజలకు సంక్షేమాన్ని చేరువ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. గత మూడేళ్ల కాలంలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక స్వావలంబన కలిగించామన్నారు. సచివాలయ పరిధిలో గత మూడేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. వలంటీర్ల సేవలపై ఆరా తీశారు. సంతృప్తికర స్థాయిలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు స్పష్టంగా పేర్కొనడంతో మంత్రి అంబటి సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్రాలు వంటి విప్లవాత్మకమైన ఆలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శవంతంగా పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఆలోచన, ఆచరణతో పేదలకు అండగా ఉంటున్నామన్నారు. గడపగడపలో వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని ప్రజా ప్రతినిధులను, అధికారులను ఆయన ఆదేశించారు. ఈ మూడేళ్లలో కొరవడిన అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సీసీ రోడ్లు, కల్వర్టులు, సైడ్ డ్రైన్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి మౌలిక వసతులు కల్పనకు సచివాలయ నిధులు వెచ్చించనున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ లబ్ధిని తెలియజేసే సంబంధిత బుక్‌లెట్లను అందించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరావు నాయక్, యువజన నాయకుడు, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, కోఆప్షన్ మెంబర్ సహరా మౌలాలి, తహసీల్దార్ నగేష్, కమిషనర్ షమీ్మ, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు ఉన్నారు.

రైతుల శ్రేయస్సు కోసమే భూరక్ష పథకం



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎస్.సురేష్

నకరికల్లు: రీసర్వే సమర్థవంతంగా చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్ ఎస్.సురేష్ సూచించారు. మండలంలోని చీమలమర్రి గ్రామంలో రీ–సర్వే పనులను గురువారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు –భూరక్ష పథకం రైతుల శ్రేయస్సు కోసమేనని అన్నారు. రైతుల వెతలు తీర్చేందుకు ఈ పథకం తోడ్పడుతుందని అన్నారు. గ్రామంలోని ప్రతి ఎకరా రెవెన్యూ భూమిని గుర్తించి చేపడుతున్న రీసర్వే భవిష్యత్తులో భూసమస్యలు రాకుండా ఉండేందుకు దోహదపడుతుందని అన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన హక్కుపత్రాల జిరాక్స్‌లను సర్వే సిబ్బందికి అందజేయాలని సూచించారు. తద్వారా సర్వే త్వరితగతిన చేపట్టే అవకాశం ఉంటుందని అన్నారు. వీఆర్వో రమణారెడ్డి, సర్వేసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇరుకుపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో వైద్యులు జయకృష్ణ, వి.సూర్యప్రకాశరావులు 92 మందికి వైద్యసేవలందించారు. వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. రక్తపరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి మెరుగైన వైద్యసేవలతో పాటుగా, వైద్యసలహాలు అందించారు. ఎంఎల్‌హెచ్‌పీ పి.శిరీష, సూపర్‌వైజర్లు ఎం.జోస్పిన్‌రాణి, ఎ.పీటర్ డానియేల్, డీఈఓ రవితేజ, ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

రాజుపాలెం: యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అనుపాలెంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆరుద్ర తిరుపతిరావు(35) ఇంటిలో ఎవ్వరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పనికి వెళ్లి వచ్చే సరికే ఫ్యాన్‌కు వేలాడుతూ ఉండడంతో చూసి నిర్ఘాంతపోయి, కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్నవారు వచ్చి కిందకు దించారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి బాబు, పాప ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎస్‌కే షఫీ, ఏఎస్ఐ పుల్లారావు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొప్పూడి గ్రామానికి చెందిన పూసల వెంకటేశ్వర్లు (58) వ్యక్తిగత పనిమీద స్కూటీపై పట్టణానికి వచ్చి, తిరుగు ప్రయాణమయ్యాడు. జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో వెళుతున్న సమయంలో ఓ ప్రైవేటు ఆసుపత్రి సమీపంలో ఎదురుగా వచ్చిన పల్సర్ వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందగా, పల్సర్ వ్యక్తికి గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు పూసల సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు చిత్తు



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

సత్తెనపల్లి: చదువు మరో తరానికి మార్పు తెస్తుందని, లక్ష్యం కోసం విద్యార్థి దశ నుంచే పాటు పడాలని మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర గుంటూరు వారి సౌజన్యంతో, హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేటి యువత మాదకద్రవ్యాల పాత్ర అనే అంశంపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర రావు అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి యువత జీవితాలను మాదకద్రవ్యాలు చిత్తు చేస్తున్నాయని, ఈ మాదకద్రవ్యాల పోకడ కాలేజీలు, పాఠశాలల, విద్యార్థులను సైతం నాశనం చేస్తుందని, సరదాగా ప్రారంభమయ్యే ఈ అలవాటు కొన్నాళ్లకు బానిసగా మారుస్తుందన్నారు. ఆత్మీయ అతిథిగా హాజరైన దంత వైద్యుడు బాజీ బాబు మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయన్నారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, ప్రతాపు బాబు సురేష్, సోమశేఖర్, చంద్ర శేఖర్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి



వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



జెడ్పీ హైస్కూల్‌లో యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెదకూరపాడు: మండల పరిధిలోని 75 త్యాళ్లూరులో వేమన కళాపరిషత్ ఆధ్వర్యంలో వేమన జయంతి సభ ఘనంగా గురువారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎంపీపీ ఈదా సాంబిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలు రాజ్యమేలుతున్న రోజుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేలా పద్యాలతో ప్రజా కవి వేమన జాతిని జాగృతం చేశారన్నారు. ఈసందర్భంగా వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి రామకోటిరెడ్డి, డాక్టర్ అనపరెడ్డి శ్రీనివాసరెడ్డి, 75 త్యాళ్లూరు సహకార సొసైటీ చైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వజ్రాల శ్రీనివాసరెడ్డి, పేరెంట్స్ కమిటి చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, గంగాధర్‌రెడ్డి, గోపిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటరెడ్డిలు పాల్గొన్నారు.

మునగోడు జడ్పీ హైస్కూల్‌లో...

అమరావతి: మండల పరిధిలోని మునగోడు జడ్పీ హైస్కూల్‌లో యోగి వేమన జయంతిని నిర్వహించారు. తొలుత యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితుడిపై అట్రాసిటీ కేసు నమోదు చేయండి

మాచర్ల రూరల్: ఏడవ మైలు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని ఏసీపీఐ నాయకుడు అబ్రహం లింకన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వాణికి అర్జీ ఇచ్చి ఆయన మాట్లాడారు. గత ఏడాది అక్టోబర్‌లో ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న బాలిక పై అత్యాచారానికి పాల్పడిన శ్రీనివాసరావు పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటివి మరోమారు జరగకుండా అట్రాసిటి కేసు నమోదు చేసి అతని కుల ధ్రువీకరణపై విచారణ జరిపించాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఓర్సు కృష్ణ, నాయకులు బండ్ల మహేష్, సంపూర్ణ, కోటేశ్వరమ్మ, అన్నమ్మలు ఉన్నారు.

విపత్తుల సమయంలో వలంటీర్ల పాత్ర కీలకం


జెడ్పీ సీఈఓ డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్: విపత్కర పరిస్థితుల్లో ప్రాణ,ఆస్తి నష్టం సంభవించకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వ సిబ్బందిపై ఉందని జెడ్పీ సీఈవో డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆపదమిత్ర పథకంపై కోటప్పకొండ డీఆర్‌డీఏ శిక్షణా కేంద్రంలో జిల్లాలోని నదీ పరీవాహక ప్రాంతం మండలాల్లోని ఎంపిక చేసిన వలంటీర్లు, ఆశ వర్కర్లులకు విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. 12 రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంలో కమ్యూనిటీ వలంటీర్లు హాజరుకానున్నారు. కార్యక్రమానికి జెడ్పీ సీఈవో శ్రీనివాసరెడ్డి, డీపీవో విజయభాస్కరరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విపత్తుల సమయంలో గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ సిబ్బంది కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. విపత్తులపై సమాచారాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు అందిస్తూ వారిని పునరావాస కేంద్రాలకు తరలించాల్సి ఉంటుందన్నారు. దీంతో పాటు ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ప్రజలను చైతన్యపర్చాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉంటుందని వివరించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయి వలంటీర్లకు ఆపదమిత్ర పథకంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, డీపీఆర్సి డీఈ శ్రీనివాస పద్మాకర్, ఈవోపీఆర్‌డీ విజయకుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్యామ్, దాసు, పంచాయతీ కార్యదర్శులు కె.వి.ప్రసాద్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలో గ్రామీణ మహిళ ప్రతిభ



వినుకొండ (నూజెండ్ల): అవకాశాలు కల్పిస్తే ప్రతిభకు కొదవ లేదని గ్రామీణ మహిళ నిరూపించింది. ఇటీవల సంక్రాంతి పర్వదినాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించింది. అందులో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సరావుపేటలో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలల్లో నూజెండ్ల మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళ నాగండ్ల గోవిందమ్మ తన ప్రతిభను కనపరచి జిల్లా స్థాయిలో కన్సోలేషన్ బహుమతి అందుకుంది. జిల్లావ్యాప్తంగా వందలాది మంది మహిళలు పాల్గొన్న ఈ పోటీల్లో ప్రతిభ కనపరచిన ఆమెను జిల్లా ఉన్నతాధికారులు నగదు బహుమతి, షీల్డుతోపాటు శాలువాతో ఘనంగా సత్కరించారు. గ్రామీణ ప్రాంతాలల్లో కూడా ప్రతిభకు కొరవ లేదని నిరూపించింది. ప్రభుత్వం ప్రోత్సాహం వల్లే తనకు గర్తింపు వచ్చిందని ఆమె తెలిపింది. దీంతో పలువురు అధికారులు ఆమెను అభినందించారు.

వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు



ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన, టీడీపీ కార్యకర్తలు

నాగవరం(క్రోసూరు): నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ దూసుకువెళ్తుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. బుధవారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే నంబూరు సమక్షంలో గ్రామానికి చెందిన జనసేన, టీడీపీ కార్యకర్తలు 20 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారందరినీ పార్టీ కండువాలు వేసి ఘనంగా స్వాగతించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి పేదకుటుంబం సంక్షేమ ఫలాలు పొందుతుందని అన్నారు. అదేవిధంగా పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. వీటన్నింటిని చూసి ప్రజలందరూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనపై ఆకర్షితులవుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కలసి కట్టుగా పనిచేసి తిరిగి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని, అప్పుడే గ్రామాలన్నీ మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో సింగడి శివయ్య, ఆవుల సారధి, అల్లం పుల్లయ్య, అక్కమ్మ, పత్తిశివయ్య, పాతూరి సాంబయ్య, భాస్కరరావు, కొండూరి అప్పారావు, సురేష్,యలవర్తి అంకమ్మరావు, శ్రీను తదితర 45 మంది పార్టీలో చేరారు. వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు పఠాన్ మస్తాన్‌వలి, షేక్ సుభాని, సానికొమ్ము సహదేవరెడ్డి, ఆవుల సాయి, తన్నీరు తాతారావు, వడ్లమూడి దేవదానం, గ్రామపార్టీ అధ్యక్షుడు అంకమరావు, షేక్ బాజి, షేక్ బాబు, క్రోసూరు నుండి ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా, క్రోసూరు గ్రామ ఉపసర్పంచ్ షేక్ మస్తాన్, గార్లపాటి దాసు, అనుముల కోటిరెడ్డి, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, గంజినబోయిన శ్రీనివాసరావు, బెల్లంకొండ ఎంపీపీ పద్మావెంకటేశ్వరరెడ్డి, షేక్ గఫూర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, మేదర రోశయ్య, పార్టీనాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధితో ఆర్థిక భరోసా

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- 10 మంది లబ్ధిదారులకు రూ. 12.70 లక్షల చెక్కుల పంపిణీ



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: పేద ప్రజల సంక్షేమానికి, ఆర్థికంగా చితికిపోయిన వారికి భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఇతోధికంగా దోహదపడుతోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం 10 మంది లబ్ధిదారులకు రూ.12.70 లక్షలు విలువైన సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందరి సంక్షేమం కోసం పారదర్శకంగా పనిచేస్తుందన్నారు. ఆరోగ్యశ్రీలో లేని వ్యాధులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఈ సాయం అందుతుందన్నారు. విద్యా, వైద్య, వ్యవసాయ రంగాల్లో ఈ ప్రభుత్వం ఆచరణాత్మక, సంస్కరణలతో కూడిన పాలనను అందిస్తోందన్నారు. విలేజ్ క్లినిక్, కుటుంబ వైద్యుని విధానం ప్రజలకు మేలు చేకూరుతుందని వివరించారు. పేద ప్రజలకు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చలంచర్ల సాంబశివరావు, ఏఎంసీ మాజీ చైర్మన్, పార్టీ సత్తెనపల్లి రూరల్ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, రాజుపాలెం మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాస రావు, ముప్పాళ్ల నాయకులు ఎంజీఆర్ లింగారెడ్డి, బాసులింగారెడ్డి, మర్రి సుబ్బారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వర రెడ్డి, పెండెం బాబూరావు, యువజన నాయకులు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, దేవతి సుబ్బారావు(మెమంటో), వెలుగూరి శరత్, కొత్త రామకృష్ణ, శివపరపు రామారావు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

బొల్లవరం(ముప్పాళ్ళ): వ్యవసాయాన్ని తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందే మార్గాలపై రైతులు దృష్టి సారించాలని దళిత బహుజన రీసోర్స్ సెంటర్ కో–ఆర్డినేటర్ మేడే వెంకటరమణ చెప్పారు. మండలంలోని బొల్లవరం గ్రామంలో డీబీఆర్సీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై ఎస్సీ, ఎస్టీ రైతులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. సాగులో సేంద్రీయ పద్ధతులు అవలంభిస్తూ కషాయాలు తయారు చేసుకుంటే సాగు వ్యయం తగ్గుతుందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పాటైతే ఉత్పత్తిదారుల సంఘం వలన సబ్సిడీ రూపంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యంత్రపరికరాలు పొందవచ్చన్నారు. నాబార్డు సంస్థ నుంచి బ్యాంక్‌రుణం ద్వారా వరికోత మిషన్లు, ట్రాక్టర్లు పొందవచ్చన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రంగయ్య, శ్రీనివాసరావు, కౌలురైతులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం: ఎస్సీ, ఎస్టీ రైతులు, సన్న, చిన్నకారు రైతులు, కౌలు రైతులు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను పొంది వ్యవసాయ అభివృద్ధిలో సత్ఫలితాలను సాధించాలని ఎన్ఆర్‌జీసీ ఏపీఓ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై ఎస్సీ, ఎస్టీ రైతులకు అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం అధ్యక్షత వహించారు. సమావేశంలో ఏపీఓ మాట్లాడుతూ కౌలు రైతు కార్డు తీసుకున్న ప్రతీ రైతుకు ప్రభుత్వం రైతు భరోసా అందజేస్తుందని తెలిపారు. అర ఎకరం పొలం ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు మునగ తోట పండించేందుకు మొక్కలను ప్రభుత్వమే పంపిణీ చేస్తుందన్నారు. ఉపాధి కార్డులకు ఆధార్ అను సంధానం చేయించుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరు జాబ్ కార్డు పొంది ఉపాధి పనులకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, టీపీ అల్లాభక్షు తదితరులు ఉన్నారు.

నూరు శాతం పన్ను వసూలు చేయాలి

డీఎల్‌పీఓ జయకృష్ణ



కార్యదర్శి రవీంద్రకు సూచనలు చేస్తున్న డీఎల్‌పీఓ జయకృష్ణ

శావల్యాపురం: గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు వసూలు నూరుశాతం అయ్యేలా క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలని నరసరావుపేట డివిజన్ డీఎల్‌పీవో చావా జయకృష్ణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటి పన్నులు వసూలపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎల్‌పీవో జయకృష్ణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు సహకారంతో వలంటీర్ల ద్వారా ఇంటి పన్నులు వసూలు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో రూ.25 కోట్లు బకాయి ఉందని అందులో శావల్యాపురం మండలంలో రూ.39 లక్షల ఉండగా, జిల్లాలో 28 మండలాలు ఉండగా 27వ స్థానంలో శావల్యాపురం మండలం ఉందన్నారు. ఇంటి పన్నులు వసూలు నూరుశాతం అయ్యేలా పంచాయతీ కార్యదర్శులు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈనెల 25లోగా 40 శాతం వసూలు చేయాలన్నారు. ఇంటి పన్ను వసూలు చేయటంలో విస్తృతస్థాయిలో గ్రామాల్లో దండోరా, మైకుల ద్వారా ప్రచారం నిర్వహించి ప్రజల్లో చైతన్యం పెంపొందించటంతో పాటు చెల్లింపులు వలన కలుగు ప్రయోజనాలు ప్రజలకు వివరించాలన్నారు. పగటి పూట వీధిలైట్లు వెలగకుండా సెన్సార్ విధానంలో వెలుగే లైట్లు పంచాయతీల్లో ఏర్పాటు చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహించిన పంచాయతీ కార్యదర్శులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పంచాయతీ వారిగా కార్యదర్శులు ద్వారా ఇంటి వసూలు చేయాల్సిన విధివిధానాలను వివరించి పురోగతి ఆరా తీశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఈవోపీఆర్‌డి పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.